ప్రజా విశ్వంభర
V3 NEWS లక్ష్యం సమాజహితం

దక్షిణాసియా టెక్స్‌టైల్స్ రాజధానిగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

పత్తి పొలాల నుండి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోల వరకు అనేక అంశాల్లో తాము కలిసి పనిచేస్తున్నామని తెలిపారు.

వరంగల్‌లో ప్రపంచస్థాయి టెక్స్‌టైల్ పార్క్...

వరంగల్‌లో కాకతీయ ప్రపంచ స్థాయి మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశామమని.. ఇందులో అనేక అపారెల్ పార్కులు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో నైపుణ్యం.. సంకల్పం కూడా ఉన్నదని అన్నారు. డీప్ టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ ఇలా అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉన్నదని వెల్లడించారు. తమ విజన్ తెలంగాణ రైజింగ్ 2047 అని.. 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడం తమ విజన్ అని స్పష్టం చేశారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2027 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్నదని.. 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలో టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. తమ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, ప్రోత్సాహకాలతో పాటు వేగంగా అనుమతులు మంజూరు చేస్తుందని చెప్పారు. ప్రపంచానికి సరితూగే విధానాలు తమ వద్ద ఉన్నాయన్నారు. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. కలిసి ప్రపంచాన్ని మార్చగల పూర్తి టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిద్దాం' అని పిలుపునిచ్చారు. హైదరాబాద్ భారతదేశానికే కాకుండా ప్రపంచానికి సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతున్నదని.. ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించిందని చెప్పారు. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్‌ను తమ కేంద్రంగా ఉపయోగిస్తున్నాయని.. ఇప్పుడు హాలీవుడ్ సైతం చేరిందన్నారు. సినిమా రంగం తమ ఫ్యాషన్‌ను కూడా తెలంగాణ నుంచే పొందేలా ప్రోత్సహిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణ తమ అత్యున్నత ప్రాధాన్యమని.. గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ప్రపంచానికి వ్యాక్సిన్లు, ఔషధాలు అందించిన రాష్ట్రం మనదని.. ఆపిల్ ఇయర్‌పాడ్స్ కూడా ఇక్కడే తయారవుతున్నాయని తెలిపారు. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో భాగస్వాములు కావాలన్నారు.

టెక్స్‌టైల్ అంటే నేతన్నకు అందించే సామాజిక న్యాయం...

తమ దృష్టిలో టెక్స్ టైల్ అంటే కేవలం వ్యాపారం మాత్రమే కాదని.. అట్టడుగున ఉన్న నేతన్నకు అందించే సామాజిక న్యాయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. వందేళ్ల కింద మహాత్మాగాంధీ చరఖాతో స్వేచ్ఛ కేవలం బ్యాలెట్ బాక్స్(ఓటు) ద్వారా మాత్రమే కాదు, మగ్గం ద్వారా కూడా వస్తుందని స్వదేశీ ఉద్యమంతో నిరూపించారన్నారు. భవిష్యత్తుకు ఇంజిన్‌లా మారుకున్నప్పుడే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని తెలిపారు. ఆ దిశగానే తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని చెప్పారు. గ్లోబల్ సప్లై చైన్‌లో నేతన్న కేవలం కూలీగానే మిగిలిపోకుండా యజమానిగా ఎదగాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. చరఖాకు టెక్నాలజీని అనుసధానించి మేడిన్ తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో న్యూ స్వదేశీ విజన్‌కు ఈ వేదికపై నుంచే శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణను కొత్త ఆవిష్కరణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే మేధో కేంద్రంగా తీర్చిదిద్దేలా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని వెల్లడించారు.

శత్రువుకు చిక్కని 'తారాగిరి'

విశ్వంభర, నేషనల్ బ్యూరో: భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్‌యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌక ను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు.

ఐఎన్ఎస్ తారాగిరి విశేషాలివే..

149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు.

ఇందులో నిశ్శబ్ద ఫిరంగుల (స్టెల్త్ ఫ్రిగేట్)తో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి.యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.

ఉత్కంఠ పోరులో పంజాబ్ గెలుపు

చెన్నై: ఐపీఎల్ 2026లో భాగంగా చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో పంజాబ్ అయిదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 209 పరుగులు చేసింది. పంజాబ్ కింగ్స్ 18.4 ఓవర్లలోనే అయిదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. పంజాబ్ బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (50; 29 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్సులు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (43, 34 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్స్), ప్రియాంశ్ ఆర్య (39, 11 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు), కూపర్ కానెల్లీ (36, 22 బంతుల్లో 6 ఫోర్లు) సమష్టిగా రాణించారు. చెన్నై బౌలర్లలో మ్యాట్ హెన్రీ, అన్షుల్ కాంబోజ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. మిగతా బౌలర్లు వికెట్లు కూల్చడంలో విఫలమయ్యారు. ప్రస్తుత ఐపీఎల్‌లో ఇప్పటి వరకు చెన్నై తాను ఆడిన రెండు మ్యాచుల్లోనూ ఓటమి పాలైంది. అంతకు ముందు చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్‌లో ఆయుష్ మాత్రే (73, 43 బంతుల్లో, 6 ఫోర్లు, 5 సిక్సులు) రాణించాడు. శివమ్ దూబె (45*; 27 బంతుల్లో, 5 ఫోర్లు, 1 సిక్స్) నాటౌట్‌గా నిలిచాడు. సర్ఫరాజ్ ఖాన్ (32; 12 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (28; 22 బంతుల్లో 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. పంజాబ్ బౌలర్లలో విజయ్‌కుమార్ వైశాఖ్ 2, జేవియర్ బార్ట్‌లెట్, మార్కో యాన్సన్, చాహల్ తలో వికెట్ తీశారు.

వాళ్ల ఓట్లు కావాలి గానీ.. సంక్షేమం పట్టించుకోరా?: హరీశ్‌రావు

విశ్వంభర, నారాయణపేట: ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని తిమ్మారెడ్డి పల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు.

హైదరాబాద్‌లో విషాదం..

పెళ్లి దుస్తులు ధరించి యువకుడి ఆత్మహత్య

విశ్వంభర, కేపీహెచ్‌బీ కాలనీ: వారిద్దరు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. అంతలోనే యువకుడు బలవన్మరణానికి పాల్పడటంతో యువతి తీవ్ర కలత చెందింది. ఈ ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఏపీలోని అనంతపురం జిల్లా పొట్లూరు మండలం చెర్లోపల్లికి చెందిన వనమల లోకేశ్(29) ఓ యువతితో రెండేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. నగరంలోని గండిమైసమ్మ ప్రాంతంలో ఇద్దరూ ఒకే ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. వివాహం చేసుకోవాలనుకున్నారు. ఇద్దరు పెళ్లిబట్టలు కూడా కొనుగోలు చేశారు. శుక్రవారం ఉదయం సమయంలో ఠాణా పరిధిలోని అడ్డగుట్టలో ఓయో గది తీసుకున్నారు.యువకుడు లోకేశ్ పెళ్లిబట్టలు ధరించాడు. మధ్యాహ్నం సమయంలో తాను పెళ్లిబట్టల్లో ఉన్నానని చెప్పి భోజనం తీసుకురమ్మని యువతిని పంపించాడు. భోజనం తీసుకుని యువతి గదికి వెళ్లి తలుపుకొట్టగా స్పందించలేదు. ఎంతకీ తీయకపోవడంతో యువతి తన స్నేహితులకు ఫోన్ చేయగా వారు వచ్చి ఓయో సిబ్బంది సాయంతో తలుపులు పగులగొట్టి చూశారు. అప్పటికే లోకేశ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. శనివారం గుడి లేదా ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకుందామని యువతికి చెప్పిన లోకేశ్.. ముందురోజే పెళ్లి బట్టలు ధరించడంపై పోలీసులు దర్యాపు చేస్తున్నారు. ఘటనపై లోకేశ్ బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కన్న కూతుళ్లను బావిలో తోసి కడతేర్చిన తండ్రి

విశ్వంభర, కరీంనగర్ కొత్తపల్లి: కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో దారుణం చోటు చేసుకుంది. కన్న కూతుళ్లను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రి.. కర్కశుడిగా మారాడు. తన ఇద్దరు కవల పిల్లల్ని బావిలో తోసేసి హతమార్చాడు. తొలుత వారిని బావిలోకి నెట్టేసిన శ్రీశైలం.. తానూ దూకేశాడు. అయితే, ఈత రావడంతో సురక్షితంగా బయటకు వచ్చేశాడు. సమాచారం అందుకున్న స్థానికులు బావిలో వెతకగా.. ఒక బాలిక మృతదేహం లభ్యమైంది. మరో మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఆగ్రహించిన గ్రామస్థులు తండ్రికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని ప్రాథమికంగా నిర్ధరించారు.

గజ్వేల్ నుంచైనా పోటీ చేస్తా

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ఎక్కడ నుంచి పోటీ చేయాలనే నిర్ణయం ఇంకా తీసుకోలేదని.. సిద్దిపేటనే కాకుండా గజ్వేల్ మహిళలకు రిజర్వ్ అయినా అక్కడి నుంచి పోటీ చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. శుక్రవారం జాగృతి భవన్‌లో మీడియా సమావేశం అనంతరం ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మా ప్రథమ శత్రువు కాంగ్రెస్. మా పోరాటం ఆ పార్టీపైనే.' అని అన్నారు. సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి, గుంట నక్క మధ్య ఒప్పందం ఉన్నదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నన్ని డబ్బులు తమ దగ్గర లేవని చెప్పారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను ఆగం చేస్తున్నారన్నారు. పార్టీ ఆవిర్భావ వేదికపై తమ ఎజెండా చెప్తామని.. తమ పార్టీ నాయకులతోపాటు ఉద్యమకారులు వేదికపై ఉండే అవకాశం ఉన్నదని చెప్పారు. ఆవిర్భావ సభకు ఇతర పార్టీల నేతలను ఆహ్వానించడం లేదని.. పార్టీ ఆవిర్భావ సభకు ముందు, తర్వాత కూడా జాయినింగ్స్ ఉంటాయని తెలిపారు. తమ పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని.. బీఆర్ఎస్ పార్టీ స్లీపింగ్ మూడ్‌లో ఉన్నదని అన్నారు. మహిళా రిజర్వేషన్లు తమకు, తమ పార్టీకి గొప్ప అవకాశమని తెలిపారు. గోవాలో 25 వేల మందికి ఒక ఎమ్మెల్యే ఉంటే.. మన దగ్గర 7 లక్షల మందికి ఒక ఎమ్మెల్యే ఉన్నారని అన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఉన్న సీట్లలో 50 శాతం సీట్ల పెంపు ఎలా సహేతుకం అవుతుందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి గతంలో మహారాష్ట్ర, బీహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తే కాంగ్రెస్ ఓడిపోయిందని.. ఇప్పుడు కేరళలోనూ అలాంటి ఫలితమే వస్తుందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీల అమలు గురించి ఆయన కేరళ ప్రజలకు చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు.

ఫీజుల దోపిడీ నుంచి రక్షించాలి...

ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఒకేసారి 30 శాతం నుంచి 40 శాతం ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఇందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సెషన్ నిర్వహించి బిల్లు పాస్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లితండ్రులపై ప్రైవేట్ స్కూల్స్ అడ్డగోలుగా ఫీజుల భారం మోపుతున్నాయని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తేవటంలో విఫలమైందంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండి ఫీజుల నియంత్రణ చట్టం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా ఇప్పటి వరకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువచ్చే ప్రయత్నమే చేయలేదన్నారు. విద్యా కమిషన్ చెత్త నివేదిక ఇచ్చిందని.. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికలో ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలనే సిఫార్సు మాత్రమే ఆమోదయోగ్యమైనదని తెలిపారు. ఫీజుల దోపిడీని ప్రోత్సహిస్తే బీఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. కార్పొరేట్, నార్త్ ఇండియన్ స్కూల్స్ ఏర్పాటుతో తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కాలేజీల యాజమాన్యాలు ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే విద్యాశాఖ మంత్రి కావడం మన ఖర్మ అన్నారు. విద్యావ్యవస్థ ఆగమవుతుంటే కనీసం రివ్యూ కూడా చేయటం లేదన్నారు.

చెరువుల పునరుద్ధరీకరణకు ప్రత్యేక కార్యాచరణ

విశ్వంభర, వరంగల్ బ్యూరో: నగరంలో చెరువుల పునరుద్ధరీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా వరంగల్ (తూర్పు)నియోజక వర్గ పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. నిర్వహించారు. పట్టణాల్లో చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అమృత్ 2.0.పథకంలో చెరువుల పునరుద్ధరీకరణలో భాగంగా రూ.6 కోట్ల వ్యయంతో నగర పరిధిలోని చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగసముద్రం చెరువులలో పునర్జీవన, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. చెరువుల అభివృద్ధి ద్వారా భూగర్భ జలాల పెరుగుదలతో పాటు పర్యావరణ పరిరక్షణ, నగర సౌందర్యం మెరుగుపడుతుందన్నారు. జలాశయాలను శుభ్రం చేసి ట్యాంక్ బండ్ తరహాలో తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. ఉర్సు రంగ సముద్రం చెరువు వద్ద నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు.

పనులు పురోగతి దశలో కొనసాగుతున్నాయి...

ఈ చెరువుతో పాటు దేశాయిపేట చెరువుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని సాధ్యమైనంత త్వరలో అట్టి పనులను పూర్తి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. వివిధ రకాల అభివృద్ధి పనులకు ఇప్పటికే నిధులు మంజూరు ఇవ్వడం జరిగిందని కొన్ని పురోగతిలో కొనసాగుతున్నాయన్నారు. కొన్ని పనులకు శంకుస్థాపన చేయాల్సి ఉందని అన్నారు. వివిధ డివిజన్ లలో పనులు పురోగతి దశలో కొనసాగుతున్నాయని వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టాలని అన్నారు. ప్రజల నుండి విజ్ఞప్తులు రాక ముందే అట్టి పనుల జాబితాను ముందస్తుగా సేకరించుకొని మేయర్ కమిషనర్ కలెక్టర్‌ల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 5 గ్యారంటీలను తీసుకోవడం జరిగిందన్నారు. ఇంటర్మీడియట్ స్థాయి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం అలాగే సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని చేపట్టడం ప్రజలకు రూ. 5 లక్షల ఉచిత జీవిత బీమా చేపట్టామన్నారు.

అధునాతన సాంకేతికతో పనిచేసే కుట్టు మిషన్లపై శిక్షణ..

టెక్స్ టైల్ పార్క్ ఈ ప్రాంతంలో ఉండడం వల్ల ఇందుకోసం ఈ ప్రాంత మహిళలకు కుట్టు మిషన్‌లో శిక్షణను అందజేయడం జరుగుతుందన్నారు. టెక్స్ టైల్ పార్కులో రాబోయే కొత్త కంపెనీలలో మహిళలకు కుట్టు మిషన్ యందు శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందుకోసం వారికి శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించడం జరిగిందని అన్నారు. అధునాతన సాంకేతికతో పనిచేసే కుట్టు మిషన్లపై శిక్షణను అందజేయడం వల్ల ఈ శిక్షణ వారికి భవిష్యత్తులో ఆదాయ వనరుగా మారుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో నగర మేయర్ గుండు సుధారాణి వరంగల్ హన్మకొండ జిల్లా ల కలెక్టర్ లు డా .సత్య శారద, చాహత్ బాజ్ పాయ్ కార్పొరేటర్ లు సురేష్ జోషి మరుపల్ల రవి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లలు చదువుకుంటే కూడా ఓర్వలేకపోతున్నారు

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు డబ్బులు లేవా?
- నాలుగైదు వేల కోట్లు ఉన్న బకాయిలను పన్నెండువేల కోట్లకు తీసుకొచ్చారు
- ప్రతి పక్షాలు ఇటీవల అసెంబ్లీలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వాకౌట్ చేయలేదు
- మంత్రులు, ఎమ్మెల్యేలు బయట తిరగలేరు.. రాళ్లతో కొట్టిస్తాం:ఆర్ కృష్ణయ్య

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కుట్ర చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. ఈ మేరకు ఆయన తాజాగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై మీడియాతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ స్టూడెంట్స్ చదువుకోకూడదనే దురుద్దేశంతోనే ఫీజు బకాయిలు చెల్లించడం లేదని తీవ్ర ఆరోపణలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించకపోతే.. మంత్రులు, ఎమ్మెల్యేలు బయట తిరగలేరని, రాళ్లతోని కొట్టిస్తామని మాస్ వార్నింగ్ ఇచ్చారు. పిల్లలు చదువుకుంటే కూడా ఓర్వలేకపోతున్నారు.. ప్రతి ఒక్కరూ రాష్ట్ర ఖజానాని దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వందల సార్లు ధర్నాలు, పోరాటాలు చేసినట్లు గుర్తుకు చేశారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ పేద విద్యార్థులకు న్యాయం జరగాలని రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చారని వివరించారు. కానీ నేటి ముఖ్యమంత్రి ఓర్వలేకపోతున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు డబ్బులు లేవా? నాలుగైదు వేల కోట్లు ఉన్న బకాయిలను పన్నెండు వేల కోట్లకు తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రతి పక్షాలు ఇటీవల అసెంబ్లీలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వాకౌట్ చేయలేదని మండిపడ్డారు.

కేరళం నుండి పాలన పాఠాలు నేర్చుకోవాల్సింది రేవంత్ రెడ్డే

విశ్వంభర, నేషనల్ బ్యూరో: కేరళంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతోంది. ఈ క్రమంలో యూడీఎఫ్ తరపున ప్రచారం చేయడానికి వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం పినరయి విజయన్‌పై చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. వీటికి పినరయి విజయన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా సమాధానమిచ్చారు. కేరళలో పర్యటించిన రేవంత్ రెడ్డి, అక్కడ ప్రధాని మోదీ, సీఎం విజయన్‌లను "మోదీ బ్రదర్స్" అని సంబోధిస్తూ విమర్శలు గుప్పించారు. కేరళంలో అవినీతి, అడ్మినిస్ట్రేటివ్ వైఫల్యాలు ఉన్నాయని, పినరయి విజయన్ పాలన 'చీకటి యుగం' అని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను "సమాచారం లేని విమర్శలు"గా విజయన్ కొట్టిపారేశారు. తెలంగాణలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న విషయాన్ని మరిచిపోయి, కేరళం అభివృద్ధి గురించి పాఠాలు చెప్పడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఆయన్ని ఎవరో తప్పుదోవ పట్టించారు," అని విజయన్ ఎద్దేవా చేశారు. నీతి ఆయోగ్ సుస్థిర అభివృద్ధి సూచీ (2023-24) ప్రకారం, కేరళం దేశంలోనే అత్యంత తక్కువ అవినీతి గల రాష్ట్రంగా అగ్రస్థానంలో ఉందని, తెలంగాణ 6వ స్థానంలో ఉందని ఆయన గుర్తుచేశారు. కేరళంలో పేదరికం రేటు కేవలం 0.55% మాత్రమేనని, ఇది దేశంలోనే అత్యల్పమని పేర్కొన్నారు. అలాగే, అక్షరాస్యత, శిశు మరణాల రేటు తగ్గించడంలో కేరళం ఎంతో ముందుందని, తెలంగాణ కంటే మెరుగైన స్థితిలో ఉందని గణాంకాలను వివరించారు. జీతాలు, పెన్షన్లు సక్రమంగా చెల్లించలేని ప్రభుత్వం నడుపుతున్న వ్యక్తి నుండి కేరళం నేర్చుకోవాల్సింది ఏమీ లేదు. కేరళం నుండి పాలన పాఠాలు నేర్చుకోవాల్సింది రేవంత్ రెడ్డే," అని విజయన్ చురకలంటించారు.

కాంగ్రెస్ మాటలు నమ్మవద్దు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేరళం ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, కావాలంటే కేరళ ప్రజలు వచ్చి చూడాలని చెప్పడం పూర్తిగా అసత్య ప్రచారమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'ఆరు గ్యారెంటీలు తెలంగాణలో పూర్తిగా విఫలమయ్యాయి. ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్లు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింది. ఇది సాధారణ అబద్ధం కాదు, ప్రజలను మోసం చేసే ప్రయత్నంగా ఉంది. కాంగ్రెస్ మాటలు నమ్మవద్దు, ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళ ప్రజలను మోసం చేశాయి. గత 10 సంవత్సరాలుగా అభివృద్ధిని అడ్డుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ వస్తే అవినీతి మరింత పెరుగుతుంది. ముఖ్యమంత్రి మాటలకు కేరళంలో విలువ లేదు. ఆయన ఎందుకు అక్కడికి వెళ్లారో అందరికీ తెలుసు. తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి. అందుకే కాంగ్రెస్ నాయకులను అక్కడ పిలుస్తున్నారు. ఉపన్యాసాలు ఇవ్వమని పిలుస్తున్నారు కానీ ఓట్లు మాత్రం పడవు' అని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు 2014కు ముందు మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలం ముంపు ప్రాంతాలను అన్యాయంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 'విభజన చట్టంలో ఉన్న అంశాలు కాంగ్రెస్, యూపీఏ ప్రభుత్వ నిర్ణయాలతో జరిగాయి. దీనికి బీజేపీ కానీ కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కాం విషయంలో తాము పూర్తి స్థాయి దర్యాప్తు కోరుతున్నాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఒక మేడిగడ్డ కానీ కొన్ని పిల్లర్ల విషయంపై మాత్రమే మాట్లాడుతున్నారు. ప్రాజెక్టు మొత్తంగా సీబీఐ విచారణకు ఇవ్వాలి. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టులో ఉంది, పూర్తి నిజాలు బయటకు రావాలి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక ఆరోపణలు చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల కేసుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, కేసీఆర్ కుటుంబంపై కేసులు పెడతామని, జైలుకు పంపుతామని, లక్ష కోట్లు వసూలు చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క కేసులో కూడా చర్యలు తీసుకోలేదు' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

పుదుచ్చేరిని రక్షించాలి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాజ్యాంగం మనకు కల్పించిన గౌరవం, స్వేచ్ఛను కాపాడుకోవాలంటే కాంగ్రెస్, డీఎంకే కూటమి బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పుదుచ్చేరిలోని మనవేలి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచిన అనంతరామన్‌కు, ఎం బాలం నియోజకవర్గం అభ్యర్థిగా నిలిచిన లక్ష్మీకాంత న్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చి పుదుచ్చేరిని రక్షించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, డీఎంకే పార్టీలతో కూడిన కూటమి ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. మా కూటమి హామీల అమలుపై ఎన్డీఏ కూటమి చేస్తున్న అసత్యాలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దన్నారు. పుదుచ్చేరి బంగారు భవిష్యత్తుకు తమ కూటమిని గెలిపించడం ఒక్కటే పరిష్కార మార్గం అన్నారు. గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని, సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని తెలిపారు.

67,173 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం..

67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని వెల్లడించారు.

తెలంగాణలో రానున్న 3 రోజుల పాటు వర్షాలు



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణలో రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.